Andhra Jyothi Dt- 01/01/14

# వాణిజ్య హబ్‌లుగా మెట్రో స్టేషన్లు

- చుట్టు పక్కల టీఓడీలు
- 300 మీటర్ల వరకు కమర్షియల్ జోన్
- కనీసం 6 మీటర్ల భవంతులు
- ప్రజా రవాణా వ్యవస్థ మెరుగుదల
- వ్యక్తిగత వాహనాల నియంత్రణే లక్ష్యం
- నమూనా అభివృద్ధి కేంద్రంగా బాలానగర్

ఆంధ్రజ్యోతి, హైదరాబాద్ సిటీ: మెట్రో రైల్ స్టేషన్ల చుట్టు పక్కల ప్రాంతాలు వాణిజ్య హబ్‌లుగా మారనున్నాయి. బహుళ రవాణా సదుపాయాలు కల్పిస్తూ నిర్ణీత విస్తీర్ణంలో రవాణా ఆధారిత అభివృద్ధి కేంద్రాల(టీఓడీ) ఏర్పాటుకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) ప్రణాళికలు సిద్ధం చేసింది. దీనికి సంబంధించిన విధివిధానాలను ప్రభుత్వానికి పంపినట్లు ఇంజనీరింగ్ విభాగం ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. జోన్స్ లాంగ్ లసల్లె ప్రాపర్టీ కన్సల్టెంట్స్ రూపొందించిన విధివిధానాల ప్రకారం యజమానులు తమ స్థలాల్లో మాల్స్, కార్యాలయాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, సర్వీస్ అపార్ట్‌మెంట్స్, ఆసుపత్రులు, హెల్త్ క్లబ్స్, హైస్ట్రీట్ రిటైల్ బిజినెస్, ఎంటర్‌టైన్‌మెంట్ జోన్స్, హాస్టల్స్ వంటివి నిర్మించుకునే అవకాశం ఉంది. ఇందుకోసం హెచ్ఎండీఏ ఇప్పటికే 19 ప్రాంతాలను గుర్తించింది. టీఓడీలో భాగంగా ఆయా ప్రాంతాల్లో వ్యాపార, వాణిజ్య సముదాయాల నిర్మాణానికి అనుమతి ఉంటుంది. ఇప్పటికే ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ(డీడీఏ) మెట్రోస్టేషన్ల చుట్టూ రవాణా ఆధారిత అభివృద్ధి ప్రణాళికలు పూర్తి చేసింది.

**నమూనా అభివృద్ధి కేంద్రంగా...**

ప్రయోగాత్మకంగా బాలానగర్ మెట్రో స్టేషన్ చుట్టూ రవాణా ఆధారిత అభివృద్ధికి హెచ్ఎండీఏ సన్నాహాలు చేస్తోంది. ఆ ప్రాంతంలోని హెచ్ఎండీఏ స్థలంలో నమూనా టీఓడీ ఏర్పాటుకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించాలని జోన్స్ కన్సల్టెన్సీని అధికారులు కోరారు. మెట్రోతోపాటు బస్, ఎంఎంటీఎస్ వంటి ప్రజా రవాణా వ్యవస్థను మెరుగుపర్చడం, వ్యక్తిగత వాహనాల వినియోగం తగ్గించడం ప్రధాన లక్ష్యంగా టీఓడీలను అభివృద్ధి చేయనున్నారు. వీలైనంత మేర పాదచారులకు సౌకర్యాలు కల్పిస్తూనే నాన్ మోటారైజ్డ్ ట్రాన్స్‌పోర్టేషన్(ఎన్ఎంటీ)లో భాగంగా సైకిల్ ట్రాక్‌లు అందుబాటులోకి తీసుకురావాలనే ఆలోచనలో ఉన్నట్లు సీటీఎస్ అధ్యయన నివేదిక సంస్థ సీనియర్ ప్లానింగ్ కన్సల్టెంట్ టి. సత్యనారాయణరెడ్డి తెలిపారు. 'స్టేషన్‌కు ఐదు కిలోమీటర్ల లోపు ఉన్న వారంతా ఎన్ఎంటీ సదుపాయాన్ని వినియోగించేలా సౌకర్యవంతమైన వసతులు ప్రతిపాదించినట్లు' ఆయన చెప్పారు.





- మెట్రో స్టేషన్ చుట్టూ 300 మీటర్ల పరిధిని కమర్షియల్ జోన్‌గా గుర్తిస్తూ బహుళ అంతస్తుల నిర్మాణాలకు అనుమతిస్తూ పురపాలక శాఖ గతంలోనే ఉత్తర్వులు జారీ చేసింది.
- రహదారుల విస్తరణ, పాదచారులకు సౌకర్యంగా ఉండేలా విశాలమైన ఫుట్‌పాత్‌లు.
- ట్రాన్సిట్ కేంద్రాలకు(రైల్, మెట్రో, ఎంఎంటీఎస్ స్టేషన్లకు) అనుసంధాన మార్గాలు.
- అందుబాటులోకి మెట్రోరైల్, ఎంఎంటీఎస్, బస్ వంటి బహుళ రవాణా వ్యవస్థలు.
- భవనాల ఎత్తు కనీసం ఆరు మీటర్లు ఉండేలా నిబంధన.
- వ్యక్తిగత వాహనాల వినియోగం తగ్గించడమే లక్ష్యం. ఇందులో భాగంగా టీఓడీ ప్రాంతంలో ఎక్కువగా వాహనాల పార్కింగ్ చార్జీలు.

ఇవీ ప్రాంతాలు...

| | | | | |
|---|---|---|---|---|
| మియాపూర్ | కూకట్‌పల్లి | బాలానగర్ | మూసాపేట | భరత్‌నగర్ |
| అమీర్‌పేట | పంజాగుట్ట | ఎర్రమంజిల్ | ఖైరతాబాద్ | నాంపల్లి |
| నాగోల్/ఉప్పల్ | తార్నాక | మెట్టుగూడ | పరేడ్‌గ్రౌండ్స్ | రసూల్‌పురా |
| హైటెక్‌సిటీ | రాయదుర్గం | ఎల్బీనగర్ | మూసారాంబాగ్ | |